## క్లుప్తంగా

### అల్వాలపాడులో కంటి వైద్య శిబిరం



ధరూరు: మండలంలోని అల్వాలపాడులో హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం గ్రామంలో నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు రత్నసింహారెడ్డి, భీంరెడ్డి, డాక్టర్ దివ్య, డాక్టర్ అంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

ధరూరు: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేయడానికి వెళ్లి విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నెట్టెంపాడులో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లొద్ద తిప్పన్న(30) బుధవారం తన పొలం వద్దకు వెళ్లి పంటకు నీళ్లు పారించేందుకు మోటార్ ఆన్ చేసి నీటిని పంటకు మళ్లిస్తుండగా, బోరు మోటారుకు ఎర్త్ అయిన కేబుల్ వైర్ షాక్ కొట్టింది. దీంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రేవులపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### యువతి అదృశ్యం

ధరూరు: యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని భీంపురంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంజనేయులు పెద్ద కూతురు పద్మమ్మను నర్వ మండలం కల్వకల్ గ్రామానికి చెందిన శేఖర్‌తో వివాహం చేశారు. పద్మమ్మ వాళ్ల ఆర్థిక పరిస్థితి బాగోలేక పెద్ద కూతురు కావేరిని(21) భీంపురంలో తమ తల్లిదండ్రుల వద్ద పెట్టింది. రెండు రోజుల క్రితం కావేరి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

### నేడు విద్యుత్ నిలిపివేత

మానవపాడు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆయా 11కేవీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 9.30 నంచి 11.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 33/11కేవీ మానవపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులో భాగంగా వీసీబీ సీటీలను మార్చడంతో పాటు 33/11కేవీ ఫీడర్‌లలో భీమవరం సబ్‌స్టేషన్ 11కేవీ, క్యాతూరు ఫీడర్‌లో చెట్లను తొలగించే కార్యక్రమం ఉన్నందున విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

### ఎంపీ టికెట్ సంపత్‌కే ఇవ్వాలి

రాజోళి: నాగర్‌కర్నూల్ ఎంపీ టిక్కెట్ సంపత్ కుమార్ కే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని ముండ్లదిన్నెలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ కార్యదర్శిగా పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న సంపత్‌కుమార్, కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని, ప్రజల సమస్యల పరిష్కారంలో తన గొంతును వినిపించే సత్తా ఉందని అలాంటి యువ నాయకుడికే పార్టీ అధిష్టానం ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పెద్దింటి నాగేష్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్రామన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పక్కీరన్న, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### శివభక్తులకు అన్నదానం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి శివ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి అర్చకులు ఆంజనేయ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### సైబర్ నేరాలపై అవగాహన

గట్టు: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై బుధవారం రాత్రి మాచర్లలో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కళాబృందం సభ్యులు మాచర్లలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ వాహన దారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ నేరానికి గురైన వారు 1930కు కాల్ చేయాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, కృష్ణ, శేషన్న, భరోసా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### టీఎన్ జీవీఏ డైరీ ఆవిష్కరణ

గద్వాల వ్యవసాయం: తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ (టీఎన్ జీవీఏ) ఆధ్వర్యంలో 2024 డైరీని ఆవిష్కరించారు. బుధవారం జిల్లా పశువైద్య, పశుసంవర్ధశాఖ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ యూఆర్ రమేష్‌లు డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు యామిని, వినయ్‌కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ర మణమ్మ, కార్యవర్గ సభ్యులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# సొంత భవనాలు నిర్మాణమయ్యేనా?

- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- మండలం ఏర్పాటయ్యాక సొంత భవనాల ఊసే లేదు
- అరకొర వసతులతో ఉద్యోగుల పాట్లు



కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలోనే పశుసంవర్ధక శాఖ కార్యాలయం

రాజోళి: మండలం ఏర్పాటు చేశారు కాని, సొంత భవనాలు నిర్మించలేదు. మండలం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా, రెండుసార్లు ప్రభుత్వం మారినా, ఇప్పటి వరకు సొంత భవనాల నిర్మాణం చేయలేదు. నూతన భవనాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసి, గత్యంతరం లేక అద్దె, పాత భవనాల్లోనే ఉద్యోగులు కాలం వెల్లదీస్తున్నారు. నూతన జిల్లాల ఏర్పాటు అనంతరం మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న రాజోళిని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. చిన్నపాటి భవనాలు నిర్మించినప్పటికీ అవి చిన్నపాటి ప్రయోజనాలకు మాత్రమే పరిమితమయ్యాయి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయాలకు మాత్రం భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

**అద్దె భవనాల్లోనే..**

మండల కేంద్రం అనగానే ముందుగా గుర్తుకు వచ్చేవి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, కాని రాజోళిలో ఈ రెండు కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్దార్ కార్యాలయం కొన్ని ఏళ్ల కిందట నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నడుస్తోంది. ఎంపీడీఓ కార్యాలయం మాత్రం అద్దె ఇంట్లో నడుపుతున్నారు. మహిళా సంఘం కార్యాలయానికి కూడా గతంలో నిర్మించిన డ్వాక్రా భవనంలోనే నడుపుతున్నారు. ఇక వెటర్నరీ భవనం రేపోమాపో కూలేందుకు సిద్ధంగా ఉండి, విష సర్పాలకు నిలయంగా మారింది. అందులోనే కాలం వెల్లదీస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటయ్యాక కొత్తగా ఎంఆర్‌సీ భవనం నిర్మించి అందులోనే ఉపాధి హామీ శాఖకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక సహకార సంఘం ఇంకా ఉమ్మడి వడ్డేపల్లి మండల ప్రాతిపదికలోనే ఉండగా, వడ్డేపల్లిలో ఉన్న కార్యాలయానికి రైతులు వెళ్లక తప్పడం లేదు. మండల కేంద్రంలో కాలేజీ ఏర్పాటు చేయాలని ఎంతోకాలంగా చిన్నపాటి ఉద్యమం చేసినా, దానిపై నేటి వరకు ఎలాంటి చలనం లేదు. ఎంఈఓ కార్యాలయం ఉమ్మడిగానే కొనసాగడం, ఒకే అధికారి ఉండటంతో రాజోళిలో ఆ భవనాలకు నిర్మాణం చేయలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి కూడా భవనం లేక పాత భవనంలోనే నడిపిస్తున్నారు.

**ప్రజలకు తప్పని ఇబ్బందులు...**

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె, పాత బడిన భవనాల్లో కొనసాగుతుండటంతో మండలంలోని ఆయా గ్రామాల నుంచి వస్తున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రధాన కార్యాలయాలు కూడా అద్దె భవనాలు కావడంతో సరైన వసతులు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఇళ్ల మధ్యనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో వాహనాలు నిలుపేందుకు సరైన స్థలం లేదు. రైతులకు సంబంధించిన సామగ్రి తీసుకెళ్లడంలో వచ్చే ఇబ్బందులతో అటు అధికారులకు, ఇటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం సొంత భవనాలను నిర్మించాలని, మంత్రులకు, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు వినతులు ఇచ్చినా ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి కూడా సొంత భవనం నిర్మించలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనైనా సొంత భవనాలు నిర్మించి, మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రభుత్వాలు మారినా ప్రయోజనం లేదు**



రాజోళిని మండల కేంద్రంగా చేశారని ఎంతో సంతోషించాం. దీంతో అభివృద్ధిలో ముందుకు సాగుతుందని అనుకుంటే, ఏళ్లు గడుస్తున్నా, నేటి వరకు ఒక్క భవనం కూడా నిర్మించలేదు. ప్రజలు కార్యాలయాలకు పెద్ద ఎత్తున వస్తుంటారు. వారికి ఇబ్బందులు కలగకుండా నూతన భవనాలు నిర్మిస్తే బాగుటుంది. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టి పెట్టాలి.

– శేషు, రాజోళి

**వినతులు ఇచ్చాం..**



గతంలో అప్పటి మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్, నిరంజన్‌రెడ్డిలకు కొత్త భవనాల ఆవశ్యకతను తెలియచేస్తూ వినతి పత్రాలు అందజేశాం. దానిపై వారు కూడా సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయమన్నారు. కాని ఈ లోగా ఎన్నికలు సమీపించడంతో ప్రక్రియ అలాగే నిలిచిపోయింది.

– మరియమ్మ, ఎంపీపీ, రాజోళి

## మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు



మానవపాడు పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

గట్టు: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజున 372 మందికి, 364 మంది హాజరు కాగా, 8 మంది విద్యార్థులు పరీక్షల కు గైర్హాజర్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్ రెడ్డి, డిపార్టుమెంట్ అధికారి కృష్ణవర్ధన్ తెలిపారు.

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని సిట్టింగ్ స్క్వాడ్ బాలకృష్ణ, శ్రీరాములు, చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షకు 179 మంది విద్యార్థులకు గాను 170 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా ఎస్ఐ చంద్రకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మల్దకల్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మల్దకల్‌లో బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 113 మంది విద్యార్థులకు 108 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది



ఎంపీటీసీలతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు

అయిజ: బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికి బలంగానే ఉందని, ప్రజల ఆదరణ తగ్గలేదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీగా ఎన్నికైన ప్రహ్లాదరెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేశారు. హాజరైన ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు ప్రహ్లాదరెడ్డిని అభినందించారు. నడిగడ్డలో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి పట్టంకట్టారని, అన్ని రకాలుగా అభివృద్ధి పనులు చేసి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎంపీపీగా ఎన్నికైన ప్రహ్లాదరెడ్డి మాట్లాడారు. ఎంపీటీసీలు ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# విజ్ఞానం నింపిన వైజ్ఞానిక ప్రదర్శన



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



ధరూరులో ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



ప్రదర్శన తిలకిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత



బాలికోన్నత పాఠశాలలో..



ధరూరులో సైన్స్ ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు

గద్వాల: చిన్నతనంలో శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తేనే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేటు పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ వేడుకలను జెడ్పీ చైర్ పర్సన్ సరిత ప్రారంభించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలన్నారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా ప్రశంసా పత్రాలు అందజేశారు.

గద్వాల అర్బన్: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించాలని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. ప్రియదర్శిని మహిళా కళాశాలలో ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వాటి గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం ఎంఏఎల్‌డీ కళాశాలలో ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. చెనుగోనిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డే ఉత్సవాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి సైన్స్‌డే విశిష్టతను విద్యార్థులకు తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు జాతీయ వైజ్ఞానిక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాగుంటన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌గౌడు, రాఘవ పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**అలరించిన విద్యార్థుల ప్రదర్శన**

రాజోళి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు ప్రయోగాలు చేసి అలరించారు. కార్యక్రమంలో సురేష్, గజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**● ఘనంగా సైన్స్ దినోత్సవం**

శాంతినగర్: విద్యార్థులందరు సైన్స్‌పట్ల మంచి అవగాహన పెంచుకుంటే సర్ సీవీ రామన్ వలె భావి భారత శాస్త్రవేత్తలవుతారని రామాపురం హెచ్‌ఎం హరుణ్ రషీద్ అన్నారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం శివప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్, కేజీబీవీ పాఠశాల ఎస్‌ఓ అనురాధల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు.

గట్టు: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సైన్స్ పట్ల ఆసక్తిని కనబర్చాలని జెడ్పీటీసీ బాసు శ్యామల కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మాచర్ల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫేర్‌ను పరిశీలించారు.

ఉండవెల్లి: మండల కేంద్రం, బొంకూరు, కలుగోట్ల కేజీబీవీలో సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్‌డే ను హెచ్‌ఎం హేమలత ప్రారంభించారు. బొంకూరులో ప్రధానోపాధ్యాయులు కామేశ్వరి ప్రారంభించారు.

ధరూరు: జాతీయ సైన్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, ఉప్పేరు, ధరూరు, రేవులపల్లి ఉన్నత పాఠశాలలు, ఇండో ఇంగ్లిష్, శ్రీలక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శన చేశారు.



ఉత్తనూరులో..



మానవపాడులో..



రామాపురంలో..



ఆరగిద్దలో..

### పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి



ధరూరు: అప్పుడే పుట్టిన పిల్లలతో పాటు ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కల మందు వేయించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏంజిల్ అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పల్స్ పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు తమ పిల్లలను తీసుకొచ్చిన పల్స్ పోలియో చుక్కల మందు వేయించాలని కోరారు.

### వాహనాల పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గద్వాల మండలంలోని జమ్మిచేడుకు చెందిన ఎరుకలి రమేష్, అనంతాపురం గ్రామానికి చెందిన ఎరుకలి ఎల్లప్ప ఇద్దరు కలిసి తమ బొలెరో, అశోక్ లేలాండ్ వాహనాలలో చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి నందిగోశాల సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి రెండు వాహనాలను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్లకు మరమ్మతులు



గద్వాల రూరల్: గద్వాల పట్టణంలోని చేపల మార్కెట్, వడ్లవీధి వార్డులలో చాలా రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయి. ఈ నేపథ్యంలో మంగళవారం దెబ్బతిన్న రోడ్లను మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పరిశీలించారు. ఎక్కడెక్కడ రోడ్లు దెబ్బతిన్నాయో గుర్తించి అవసమరైన మరమ్మతు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వార్డులలో సమస్యలుంటే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని సంబంధిత వార్డు కౌన్సిలర్ జయశ్రీతో చెప్పారు. కార్యక్రమంలో డీఈ సందీప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు పనిచేయాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సుధారాణి

అయిజ: అంగన్‌వాడీ టీచర్లు నిబంధనల మేరకు పనిచేయాలని డీడబ్ల్యూఓ సుధారాణి ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 9.40 గంటలకు తెరిచి ఉంచాలని, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తప్పనిసరిగా యూనిఫాంలో ఉండాలని, మెనూ ప్రకారం వంట చేయాలని, అంగన్‌వాడీ సెంటర్లను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కల్యాణ్, సూపర్‌వైజర్ బాలమ్మ, వివిధ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారి తెప్పోత్సవ కార్యక్రమం



హోమంలో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండలంలోని అల్వాలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామి వారి అలంకరణ, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద ఉన్న కోనేరులో స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించారు. గురువారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం ఉంటుందని నిర్వహకులు తెలిపారు.

**వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు**

అయిజ: పట్టణ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మస్వామి ఆలయంలో బుధవారం నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా సుప్రభాతసేవ, స్వస్తీపారాయణం, మూలవిరాట్లకు అభిషేకం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కళశస్థాపన పూజలు నిర్వహించారు. సర్వతో భద్ర మండలి పూజ, హోమ ప్రజ్వలన, ధ్వజారోహణం, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ, అంకురార్పణ మూల విరాట్ల హోమం, బలిహరణ నిర్వహించారు.

### కొంకల భీమన్నను పరామర్శించిన ఎమ్మెల్యే

శాంతినగర్: ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంకల భీమన్నను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బుధవారం పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భీమన్నను పరామర్శించిన ఎమ్మెల్యే ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా మత్స్యశాఖ చైర్మన్ గోపాల్, బీఆర్ఎస్ నాయకులు వున్నారు.



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాంతినగర్: వడ్డేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వలె బోధన చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నిర్మలాజ్యోతి, ఉపాధ్యాయులు నాగరాజు, భాస్కర్, ఊశన్న, రమణ, ఎజాజ్, రాజశేఖర్‌ఆచారి, వినోద్‌లు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని తూంకుంట ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి బోధన చేశారు. నోడల్ ఆఫీసర్ దయాల్ రాముడు హాజరయ్యారు. పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు పాఠశాలకు ప్రింటర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగపతిరెడ్డి, హనుమంతురెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మన్న, విద్యార్థులు పాల్గొన్నారు.